క్లుప్తంగా

భరోసా యాత్రను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఇచ్చోడ: సరుర్‌నగర్‌లో ఈనెల 7న నిర్వహించే బీఎస్పీ తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి మెస్రం జంగుబాబు కోరారు. సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరుకానున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు బహుజన ప్రజస్వామ్యవాదులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పాముల హరినాథ్, కామ్రె పోశెట్టి, దిగంబర్, రవి పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలం'



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. సోమవారం ప్రజాసమస్యలపై మండలంలోని గోపాల్‌సింగ్‌తండా, తుమ్మగూడ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. ఏ ఒక్కరికీ కూడా డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ దిపక్‌సింగ్ షేకవత్, ఆరెల్లి రాజలింగు, ముండే రాజేశ్వర్, దిలిప్ మోరే పాల్గొన్నారు.

వీవోఏల నిరసన



సమ్మెల్లో పాల్గొన్న వీవోఏలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట వీవోఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం సమ్మెల్లో పాల్గొన్న వీవోఏల సంఘం నాయకులు మాట్లాడారు. సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శైలేందర్‌రెడ్డి, బరుకుంట సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఈత కొలను తాత్కాలికంగా మూసివేత

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈతకొలను 4 రోజుల పాటు తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు నిర్వాహకుడు కొమ్ము కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల కారణంగా వర్షపు నీరు తొలగింపు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. శుక్రవారం నుంచి స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభిస్తామన్నారు.

వాహనాల తనిఖీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆదిలాబాద్ బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం ఎస్సై శ్రీకాంత్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు తమ వాహన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లైసెన్స్, ఇన్స్‌రెన్స్ లేకుండా వాహనం నడపవద్దన్నారు. మద్యం సేవించి నడిపే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీకాలపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఇచ్చోడ: గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు హిమబిందు, సర్పారాజీలు తెలిపారు. సోమవారం నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. గర్భిణులకు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఘనంగా మే డే



బేల: మేడే వేడుకల్లో సీఐటీయూ నాయకులు



ఎదులాపురం: నినాదాలు సీఐటీయూ నాయకులు

జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. అనంతరం అమరులైన కార్మికులకు నివాళులర్పించారు. ప్రపంచ కార్మిక ఐక్యతకు మే డే సంకేతమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు సాధించే వరకు పోరాడుతామన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాంసి: పిప్పల్‌కోటిలో..



నేరడిగొండ: నినాదాలు చేస్తున్న జెడ్పీటీసీ



ఇంద్రవెల్లి: జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు



బోథ్: జెండా ఎగురవేస్తున్న నాయకులు



బజార్‌హత్నూర్: జెండా ఆవిష్కరిస్తున్న దేవేందర్‌గౌడ్



ఆదిలాబాద్: జెండాను ఆవిష్కరిస్తున్న ఎంబీ రావు



నార్నూర్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..



తలమడుగు: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పంజాబ్‌చౌక్‌లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, అశోక్ స్వామి, సాజిద్, దుర్గం శేఖర్, సిడం రాంకిషన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇచ్చోడ: ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇన్‌చారిజ ఏఈ రాజు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దుప్పాపూర్‌లో రాత్రి బడి ప్రారంభం



ప్రారంభిస్తున్న సర్పంచ్ కనక సేవంతబాయి

నార్నూర్: మండలంలోని దుప్పాపూర్‌లో ఖైర్‌డట్వా గ్రామ పంచాయతీ సర్పంచ్ కనక సేవంతబాయి, ఐకేపీ ఏపీఎం రమేశ్‌లు సోమవారం రాత్రి బడి ప్రారంభించారు. నోట్ బుక్స్, పలకలు అందజేశారు. గ్రామంలోని అందరు 100% అక్షరాస్యత సాధించడమే రాత్రిబడి ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతిఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నారు. కార్యక్రమంలో సంతోశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వందన, జీపీ కార్యదర్శి మమత, కనక ప్రభాకర్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: అకాల వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సోమవారం పరిశీలించారు. మండలంలోని శ్యాంపూర్‌లో వర్షానికి ఇళ్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో అధికారులతో పరిశీలించి, తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు వెంటనే సరిచేసి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం, వైస్ ఎంపీపీ బాలాజీ పాల్గొన్నారు.

పుచ్చకాయ సాగుతో లాభాలు



పొన్నారిలో సాగుచేసిన పుచ్చకాయ పంట

- ఆదర్శంగా నిలుస్తున్న పొన్నారి రైతులు
- ఈఏడాది మార్కెట్‌లో మంచి డిమాండ్

తాంసి: జిల్లా రైతులు సాధారణంగా పత్తి, సోయా, కంది పంటలను మాత్రమే పండిస్తుంటారు. కానీ ప్రస్తుతం కొంత మంది రైతులు వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత కొన్నేళ్లుగా పలువురు రైతులు పుచ్చకాయ పంట సాగు చేస్తూ.. అధిక లాభాలు పొందుతున్నారు. తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలోని రైతులు ఏటా పుచ్చకాయ పంట సాగు చేస్తున్నారు. పత్తి, సోయా పంట కాలం ముగిసిన వెంటనే రెండో పంటగా ప్రతీ వేసవిలో పుచ్చకాయ పంట సాగు చేస్తున్నారు.

మూడు నెలల్లో చేతికి..

పుచ్చకాయ పంట సాగు చాలా సున్నితమైంది. సాగుకు భూములు అనుకూలంగా ఉండడంతో రైతులు ముందుకొస్తున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి మూడు నెలల్లో పంట చేతికి వస్తుంది. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ. 40వేల ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. తెగుళ్లు వినహా ఇతర పురుగుల వ్యాప్తి అంతగా ఉండదు. తెగుళ్లను మొదటగా గుర్తించి మందులు పిచికారి చేస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. ఎకరానికి 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

మార్కెట్‌లో డిమాండ్..

ప్రతీ సంవత్సరం వేసవిలో పుచ్చకాయకు మంచి డిమాండ్ ఉంటుంది. గత రెండేళ్ల క్రితం అంతంతగా డిమాండ్ ఉండడంతో సాగు చేసిన రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు పుచ్చకాయ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో రైతులకు లాభాలను తెచ్చిపెడుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పుచ్చకాయ కిలో రూ.15 నుంచి నుంచి 20 వరకు పలుకుతోంది. వ్యాపారులు రైతులకు కిలో రూ.10 నుంచి రూ.12 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

రెండు ఎకరాల్లో సాగుచేశా



గత ఐదు సంవత్సరాలు రెండో పంటగా పుచ్చకాయ సాగు చేస్తున్నాను. ఈఏడాది రెండు ఎకరాల్లో పంటను సాగుచేశాను. పెట్టుబడి కోసం రూ.90 వేలు ఖర్చు చేశాను. సాగు చేసిన పంట ప్రస్తుతం దిగుబడి వస్తుంది. ఇప్పటికే 6 టన్నుల వరకు విక్రయించడం జరిగింది.

– అండే ఆనంద్, పొన్నారి

జాగ్రత్తలు పాటిస్తే మేలు



పుచ్చకాయ సాగు చేయడంతో పాటు తెగుళ్ల నివారణలో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. గత మూడేళ్లుగా పుచ్చకాయ పంటను సాగు చేస్తున్నాను. ఈఏడాది మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

– దేవిదాస్, పొన్నారి, రైతు

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇవ్వడం అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్: బౌద్ధ జయంతిని పురస్కరించుకొని చిన్నారులకు బౌద్ధ పాఠాలతో పాటు సమతా సైనికల్ దళ్ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్ అన్నారు. మహారాష్ట్రలోని వర్ధ నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన బౌద్ధ గురువులను సోమవారం కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ గ్రామానికి చెందిన రాందాస్ కూతురు గంగామణి ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా.. తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆస్పత్రికి చేరుకొని బాధితురాలిని పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి ఆమెను తరలించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో వెల్మా లింగారెడ్డి, భాగ్యవతి దంపతులు సొంత ఖర్చుతో అడెల్లి పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. మంగళవారం వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. భక్తుల పెద్ద అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు సర్పంచుల మద్దతు

బోథ్: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బోథ్ మండల సర్పంచులు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని త్వరలోనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థిని ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో భీంపూర్ కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జక్కుల నికిత జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచింది. 72 శాతం మార్కులతో 21వేల ర్యాంక్ సాధించింది. విద్యార్థిని డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీలు అభినందించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

బోథ్: నకిలీ విత్తనాలమ్మితే చర్యలు తీసుకుంటామని బోథ్ సీఐ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం రైతువేదికలో ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు చట్టాలకు లోబడి విత్తనాలను విక్రయించాలని రైతులకు తప్పనిసరిగా రసీదు అందించాలని సూచించారు. లేదంటే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రవీందర్, ఏడీఏ శ్రీధర్, ఏవో విశ్వమిత్ర, డీలర్లు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు



ఊరేగింపులో పాల్గొన్న వైశ్య సంఘం సభ్యులు

బోథ్: బోథ్ పట్టణంలో ధర్మశాలలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ధర్మశాల నుంచి బోథ్ పురవీధుల గుండా మహిళలు కోలాటలతో నృత్యం చేస్తూ.. ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కత్తూరి సంపత్, ముత్యపు ధనలక్ష్మి, సంతోశ్, కత్తూరి విశ్వనాథ్, వెంకటేశ్, రమాకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్

బేల: రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ గంగాధర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గణేశ్ గార్డెన్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, అడ్డి భోజారెడ్డి, జోగు ప్రేమేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ కిషన్

బజార్‌హత్నూర్: జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని డీఆర్‌డీవో పీడీ కిషన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అదే సమయంలో పనుల కల్పనలో సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని కొలారి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూలీల వేతనం ఎప్పటికప్పుడు ఖాతాల్లో జమచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రవీందర్, ఎంపీడీవో చౌహన్ రాధ, ఏపీవో శ్రీనివాస్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. భగీరథ నీరు లీకేజీ



తలమడుగు: మండలంలోని లక్ష్మీంపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. మరమ్మతులు చేపట్టకపోదంతో నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఫోన్: 63099 54495